క్లుప్తంగా

రామానుజాచార్య జయంతి ఉత్సవాలు



అలంకరణలో రామానుజాచార్య విగ్రహం

గుడుపల్లె: శ్రీ రామానుజాచార్య జయంతి ఉత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. మండలంలో కనమనపల్లెలోని శ్రీదేవి భూదేవి శ్రీనివాసస్వామి ఆలయంలో శ్రీ రామానుజాచార్య విగ్రహాలను ప్రత్యేకంగా వివిధ రూపాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ, మంగళవాయిద్యాల హోరు నడుమ ఆలయం చుట్టూ ఉత్సవ మూర్తులను ఊరేగించారు. రామానుజాచార్యుల విరచిత కీర్తనలు ఆలపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు.

ఒక ఈతలో ఐదు మేకపిల్లలు



ఐదు పిల్లలతో తల్లి మేక

రొంపిచెర్ల: ఒకే ఈతలో మేక ఐదు పిల్లలను ఈనిన సంఘటన రొంపిచెర్ల మోటుమల్లెల గ్రామ పంచాయతీ నగిరి దళితవాడలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. రైతు గాలి శ్రీనివాసులు మూగజీవాల పెంపకంపై ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇంట్లో ఉన్న 20 మేకలను మూడు నెలల క్రితం విక్రయించారు. ఒక మేకను మాత్రం మూడు నెలలుగా మేపుతున్నాడు. ఆ మేక ఆదివారం రాత్రి ఐదు మేక పిల్లలను ఈనింది. వీటిలో నాలుగు మగవి, ఒక ఆడ మేక పిల్ల ఉన్నాయి. మొదటి ఈతలో రెండు, రెండవ ఈతలో మూడు పిల్లల్ని ఈనిన మేక మూడవ ఈతలో ఏకంగా ఐదు పిల్లలను ఈనడం గమనార్హం! మేక పిల్లలన్నీ ఆరోగ్యంగా ఉన్నాయి. అయితే అవి చాలా తక్కువ బరువుతో ఉన్నాయి.

గంగమ్మకు పూజలు

బంగారుపాళెం: మండలంలోని పెరుమాళ్లపల్లెలో ఆదివారం గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి వార్షిక పూజాకార్యక్రమంలో భాగంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం అమ్మవారి మూలవిగ్రహాన్ని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో శనివారం అర్ధరాత్రి వరకు 76,945 మంది స్వామివారిని దర్శించుకోగా 33,844 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 16 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఈ ఐదేళ్లలోనే ఇంత అభివృద్ధి!

- మారిన నగర రూపురేఖలు
- ప్రధాన కూడళ్లను అందంగా తీర్చిదిద్దిన వైనం
- రాష్ట్రానికే తలమానికంగా నిలిచిన విజయా డెయిరీ పునఃప్రారంభం
- రూ.42 కోట్లతో న్యాయస్థానాల భవనం



చిత్తూరు గాంధీ విగ్రహ కూడలి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజకవర్గ రూపురేఖలు ఏవైనా మారాయా..?అంటే అది ఈ అయిదేళ్లలోనే అని కచ్చితంగా చెప్పొచ్చు. గత పాలకులు జిల్లా కేంద్రాన్ని నిర్లక్ష్యం చేశారు. పేరుకు జిల్లా కేంద్రంగా ఉన్నా, విద్యా, వైద్య పరమైన అభివృద్ధి మొత్తం తిరుపతిలోనే కేంద్రీకరించారన్న అపవాదు ఉంది. కానీ ఈ ప్రభుత్వ హయాంలో చిత్తూరు జిల్లా కేంద్రంతోపాటు గుడిపాల, చిత్తూరు రూరల్ మండలాల్లో ప్రజలకు కవాల్సిన మౌలిక వసతులు, సదుపాయాలను కల్పించారు. చిత్తూరు కేంద్రంగా రూ.కోట్లతో కూడళ్లను అభివృద్ధి చేసి కొత్త భవనాలు, పాల డెయిరీ లాంటి పరిశ్రమలను తీసుకొచ్చింది ఈ ప్రభుత్వమే.

ఇది కదా అభివృద్ధి..!

- చినుకు పడితే చిత్తూరు రోడ్లలో పరిస్థితి దారుణంగా ఉండేది. కానీ ప్రతీ కాలనీ, వార్డుల్లో సిమెంటు రోడ్లు, మురుగునీటి కాలువలు నిర్మించారు. ఫలితంగా ప్రజలకు కనీస వసతులు, సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి.
- నగరంలో ఈ ఐదేళ్లలో రూ.2.03 కోట్లతో బోర్లు వేశారు. ప్రజలకు నీటి కష్టాలు రాకుండా పైపులైన్ల ద్వారా నీటి సమకూర్చారు.
- రూ.9.81 కోట్లతో దాదాపు 19.24 కిలోమీటర్ల దూరంలో మురుగునీటి కాలువలు నిర్మించారు.
- గత ప్రభుత్వం మొండి గోడలతో వదిలేసిన పూనేపల్లె టిడ్కో గృహాలను, ఈ ప్రభుత్వం రూ.138 కోట్లు వెచ్చించి పూర్తి చేసి, లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించింది.
- సంక్షేమ పథకాల ద్వారా నియోజకవర్గంలోని 1,83,939 మంది లబ్ధిదారులకు నేరుగా బ్యాంకు ఖాతాల్లో రూ.508.19 కోట్లు, ఇతర సంక్షేమ పథకాలు (నాన్ డీబీటీ) కింద రూ.628.24 కోట్లు అందించింది. నియోజకవర్గం మొత్తంలో రూ.1136.43 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు మేలు చేసింది.
- నగరంలోని గాంధీ విగ్రహ కూడలి, గంగినేనిచెరువు కట్ట, కట్టమంచి చెరువు కట్ట, ఎంఎస్ఆర్ కూడలి లాంటి ప్రాంతాలతోపాటు పార్కుల అభివృద్ధికి రూ.3.76 కోట్లు వెచ్చించారు.
- చిత్తూరు జిల్లా కేంద్రంలో ఒకే భవనంలో 15 న్యాయస్థానాల ఏర్పాటుకు అధునాతన జిల్లా న్యాయస్థానాల సముదాయం (కోర్టు కాంప్లెక్సు)ను రూ.42 కోట్లతో నిర్మించగా.. ఇటీవల సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు దీన్ని ప్రారంభించారు.
- టీడీపీ ప్రభుత్వ హయాంలో మూసేసిన చరిత్రాత్మకమైన విజయా పాల డెయిరీని, ఈ ప్రభుత్వం అమూల్ సంస్థ ద్వారా పునఃప్రారంభించింది. అందుకోసం రూ.385 కోట్ల పెట్టుబడులను పెట్టింది. ఇప్పటికే శరవేగంగా జరుగుతున్న పనులు పూర్తయి, డెయిరీ ప్రారంభమైతే ప్రత్యక్షంగా 5 వేల మందికి, పరోక్షంగా 2 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.
- ఇక చిత్తూరు సహకార చక్కెర ఫ్యాక్టరీ మూయించిన చంద్రబాబు నాయుడు కార్మికులను, రైతులను నడిరోడ్డున పడేశాడు. కానీ ఈ ప్రభుత్వ హయాంలో కార్మికులకు రూ.31 కోట్ల బకాయిలు చెల్లించింది.

కరోనా టైంలో ఆదుకున్నారు



కరోనా సమయంలో దేశమంతా అతలాకుతలమైపోయింది. గడప దాటి వెళ్లే పరిస్థితి లేదు. ఆ సమయంలో నాకు కోవిడ్ సోకింది. ఎలా కోలుకోవడం అనుకున్నాను. అలాంటి సమయంలో ఈ ప్రభుత్వం వలంటీర్ల ద్వారా నిత్యావసరుకులు, మందులు మా ఇంటికే పంపించింది. వైద్య సిబ్బంది తీసుకెళ్లి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా వైద్యం అందించారు. అక్కడ పూటపూటకూ మంచి భోజనం పెట్టారు. వైద్యులు, సిబ్బంది రోజు మాట్లాడుతూ భరోసానిచ్చారు. డిశ్చార్జి అయ్యాక ఖర్చుల కోసం రూ.2 వేలు ప్రభుత్వం అందించింది. ఇంటికి వచ్చాక మందులు సైతం ఇచ్చారు.

–ఈశ్వరి, తేనబండ, చిత్తూరు



గంగినేనిచెరువు కట్టపై చుడా నిధులతో చేసిన అభివృద్ధి పనులు



చిత్తూరులో నూతనంగా నిర్మించిన కోర్టు భవనాలు



ప్రస్తుతం చిత్తూరు పాల డెయిరీ వద్ద జరుగుతున్న భవన నిర్మాణ పనులు

తిరుపతి గంగ జాతర పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ ఈఓ మమత

తిరుపతి కల్చరల్: తిరుపతి గ్రామదేవత శ్రీతాతయ్యగుంట గంగమ్మకు మంగళవారం చేపట్టే చాటింపుతో అమ్మవారి గంగజాతర ఆరంభం కానుంది. భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి గంగమ్మ తల్లి జాతరను పురస్కరించుకొని తిరుపతి నగరంలోని వ్యాపార సంస్థలు అమ్మవారి జాతర ప్రచారం పోస్టర్లు, కరపత్రాలు, ఆహ్వాన పత్రికలు, బారికేడ్లు, డస్ట్‌బిన్స్ తదితర సామగ్రిని ఆలయానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతర పోస్టర్లు, కరపత్రాలు, ఆహ్వాన పత్రికలను ఆలయ ఈఓ కె.మమత వ్యాపార సంస్థల ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. శుభమస్తు షాపింగ్ మాల్ అధినేతలు బయ్యా శ్రీనివాసులు, బయ్యా రవికుమార్ ఆధ్వర్యంలో 25 బారికేడ్లు, 2 వేల పోస్టర్లు, 25 డస్ట్‌బిన్లు, ఒక వాటర్ కూలర్ అందించారు. అలాగే సీఎంఆర్ షాపింగ్ మాల్ వారు 17 బారికేడ్లు, రెండువేల పోస్టర్లు, కరపత్రాలు అందజేశారు. మెడిమిక్స్ సంస్థ వారు జాతర ఆహ్వాన బుక్‌లెట్స్, 2 వేల పోస్టర్లు, 20 బ్యానర్లు, అభిరుచి ఫుడ్స్ వారు ప్రసాదం బ్యాగులు, జాతర కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఈఓ కె.మమత మాట్లాడుతూ భక్తుల కోర్కెలు తీర్చే తిరుపతి గ్రామదేవత గంగమ్మ తల్లి జాతర సందర్భంగా వ్యాపార సంస్థలు తమ వంతు సాయంతో సహకారం అందించి అమ్మవారిపై తమ భక్తిని చాటుకోవడం అభినందనీయమన్నారు. వారం రోజులపాటు అత్యంత వేడుకగా జరిగే అమ్మవారి జాతర మరింత వైభవంగా జరగాలని ఆకాంక్షిస్తూ జాతర ప్రచారానికి అవసరమైన పోస్టర్లు, కరపత్రాలు, ఆహ్వాన బుక్ లెట్స్, అందించడంతోపాటు జాతరలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా బారికేడ్లు అందించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, శుభమస్తు మేనేజర్ మునిశంకర్, సీఎంఆర్ మేనేజర్ బాలకృష్ణ, వెంకటేష్, మోహన్, మెడిమిక్స్ సంస్థ ప్రతినిధులు మధుసూదన్, నరేంద్రబాబు, కరుణకుమార్ బాలమురుగన్, అభిరుచి ఫుడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

జనం బాగుకోరే వాళ్లకే ఓటు!

2019 ముందు....

ఓ పేద కుటుంబానికి 2019 సంవత్సరానికి ముందు ప్రజాసేవలకు తప్పని తిప్పలు. అందని ద్రాక్షగా ప్రభుత్వ పథకాలు. అవస్థల నడుమ జీవనం. పథకాలు, ఇంటి కష్టం తీర్చే వారి కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూపులు. అయినా పట్టించుకునే పాలకులు, నాయకులు కరువు. పచ్చ తమ్ముళ్ల చుట్టూ ప్రదక్షిణలు. ఇవన్నీ వెరసి ఈ పేద కుటుంబాన్ని వేధించాయి. చిత్తూరు మండలం పెరుమాళ్లకండ్రిగ గ్రామానికి చెందిన వసంతమ్మ, భర్త బండెబ్బ ఇద్దరూ దినసరి కూలీలే. వీళ్లకు నలుగురు సంతానం. వీరిలో ముగ్గురి కుమారులకు వివాహాలై పిల్లలున్నారు. రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితి. దారిద్ర్యరేఖకు దిగువనున్న ఈ కుటుంబం జానెడు సొంతింటి స్థలం కోసం నాటి టీడీపీ ప్రభుత్వంలో వేడుకుంటే అన్ని అర్హతలున్నా జన్మభూమి కమిటీలోని పచ్చనేతలకు చిల్లరకాసులు ఇవ్వలేదని అర్హత జాబితాలో ఉన్న పేరును తొలగించారు. పచ్చనేత కుట్రతో ఇద్దరు కుమారులు, వారి దంపతులతో పాటు చిన్న పెంకుటింట్లో జీవిస్తున్నారు. ఎలాగైనా మోల్డింగ్ వేసుకోవాలని కొన్నేళ్ల పాటు పాలకులు, అధికారుల చుట్టూ తిరిగినా ఉపయోగంలేదు. దీంతో వసంత కుటుంబం అవస్థల నడుమ కొట్టుమిట్టాడింది. తర్వాత వసంతమ్మ భర్త వృద్ధాప్య పింఛన్ మంజూరు కోసం టీడీపీ నేతలు తమ చుట్టూ తిప్పించుకున్నారు. కుమారుడు, కోడలు డిగ్రీ పూర్తి చేసిన ఉద్యోగ అవకాశాలు రాలేదు. ఇంటికో ఉద్యోగం అని చూపి ఆ కుటుంబాన్ని నిరాశపరిచింది. ఫలితంగా పథకాలు తీసుకోవడానికి నాటి పచ్చ నాయకులతో పోరాడి అలసిపోయారు.



కుటుంబ సభ్యులతో వసంతమ్మ

2019 తర్వాత చూస్తే...

కాలచక్రంలో ఐదేళ్లు గిర్రున తిరిగాయి. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం రావడంతో ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కుమారులకు ఇంటి స్థలం, పక్కా గృహ నిర్మాణాన్ని మంజూరు చేయడంతో పాటు ఈమెకు ఇల్లు కట్టుకోవడానికి హౌసింగ్ రుణాన్ని కూడా మంజూరు చేసింది. దీంతో పాటు ఈ కుటుంబానికి వైఎస్సార్ చేయూత కింద రూ.18,750, ఆసరా కింద ఏటా రూ.14వేలు, సున్నావడ్డీ రూ.11వేలు అందజేసింది. ఇక వసంతమ్మ భర్తకు నెలనెలా వృద్ధాప్య పింఛన్, ఏటా వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.13,500 అందుతోంది. వీళ్ల కుమారుడు జానీ టైలర్ వృత్తితో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వీరికి రేషన్ కార్డు మంజూరైంది. తర్వాత ఇంటి స్థలంతో పాటు కట్టుకోవడానికి హౌసింగ్ ద్వారా అవసరమైన ఆర్థికసాయాన్ని అందించింది. వైఎస్సార్ చేదోడు కింద ఏటా రూ.10వేలు, జానీ భార్యకు అమ్మ ఒడి కింద రూ.15వేలు, వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ వస్తోంది. మరో కొడుకు చిరంజీవి ప్రైవేటు కంపెనీలో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. ఇతడి భార్య షాలినీకి వలంటీర్ ఉద్యోగం వచ్చింది. ఇంటి స్థలం, గృహనిర్మాణానికి రుణం ఇప్పించారు. ఇక అమ్మఒడి కింద రూ.15 వేలు, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.2వేలు, సున్నావడ్డీ కింద రూ.800 అందుతోంది. ఇలా ఈ కుటుంబం ఏటా రూ.లక్షకు పైగా లబ్ధిపొందుతున్నారు. జనం బాగోగులు పట్టించుకుంటూ, కష్టకాలంలో ఆదుకున్న వాళ్లకే ఓటు వేస్తామని వసంతమ్మ తేల్చి చెప్పారు.

–చిత్తూరు అర్బన్





పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలకు చేసిన ఏర్పాట్లు



నేడు ఎన్నికల సంగ్రామం.. సర్వం సిద్ధం

- చిత్తూరులో 2.02 లక్షల ఓటర్లు
- 226 పోలింగ్ కేంద్రాలు.. పటిష్ట భద్రత
- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలో సోమవారం నిర్వహించే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశామని ఆర్‌ఓ శ్రీనివాసులు వెల్లడించారు. ఆయన ఆదివారం పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్‌ఓ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సామగ్రి, సిబ్బంది చేరుకున్నట్లు తెలిపారు. పలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఏర్పాట్లు పర్యవేక్షించినట్లు చెప్పారు. నియోజకవర్గ పరిధిలో 226 పోలింగ్ కేంద్రాలు, 33 సమస్యాత్మక కేంద్రాలున్నట్లు తెలిపారు. ఆ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామన్నారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలున్నట్లైతే 94910 77002కు తెలియజేయాలని ఆయన వెల్లడించారు.



గుడిపాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికలు – 2024. సుదీర్ఘంగా 55 రోజుల పాటు సాగిన ఎన్నికల కసరత్తులో భాగంగా సోమవారం పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో చిత్తూరు నియోజకవర్గంలో పోలింగ్ ముఖచిత్ర వివరాలు పరిశీలిస్తే..

నియోజకవర్గం: చిత్తూరు కార్పొరేషన్, గుడిపాల, చిత్తూరు రూరల్ మండలాలు

పోలింగ్ సమయం: ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు

భద్రత: ఏఎస్పీ, డీఎస్పీతో పాటు 600 మంది వరకు పోలీసు సిబ్బంది

ఓటర్లు

మొత్తం ఓటర్లు	-	2.02.850
స్త్రీలు	-	1.04.101
పురుషులు	-	98.718
ఇతరులు	-	31

పోలింగ్ కేంద్రాలు		
మొత్తం కేంద్రాలు	-	226
చిత్తూరు నగరం	-	150
గుడిపాల	-	45
చిత్తూరు మండలం	-	31
సమస్యాత్మకం	-	33
సిబ్బంది		
సెక్టోరియల్ అధికారులు	-	23 మంది
రూట్లు	-	23
పోలింగ్ అధికారులు	-	226 మంది
ఏపీవోలు	-	226 మంది
మైక్రో అబ్జర్వర్లు	-	42 మంది
వెబ్‌కాస్టింగ్	-	60 కేంద్రాలు









పోలింగ్ సామగ్రితో కేంద్రాలకు చేరుకుంటున్న ఎన్నికల అధికారులు, సిబ్బంది, దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన వీల్‌చైర్, పోలింగ్ సరళిని పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

ద్రౌపదీ ధర్మరాజుల మహోత్సవాలు ప్రారంభం





ధర్మరాజు విగ్రహం వద్ద కడవపై ఉంచిన కత్తిచ విద్యుత్ అలంకరణతో ముస్తాబైన ధర్మరాజు ఆలయం

గుడుపల్లె: మండలంలో యామగానిపల్లెలోని శ్రీ ద్రౌపదీ ధర్మరాజుల మహాభారత మహోత్సవాలు ఆదివారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా ముస్తాబు చేశారు. కుప్పం నియోజకవర్గంలోని 86 గ్రామాలకు సంబంధించిన వన్నె కుల క్షత్రియులు ఆలయ ఆవరణలో 18 రోజులు మహాభారత మహోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. పగలు హరికథా కాలక్షేపం, రాత్రి నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. 13న సోమవారం యయాతి చరిత్ర, 14న శంతన చరిత్ర భీష్మ ప్రతిజ్ఞ, 15న ధృతరాష్ట్ర పాండవులు, విదురుడి జననం, 16న పాండవ కౌరవ జననం, 17న పాండవ కౌరవ విద్యాభ్యాసం, ఏకలవ్యుని చరిత్ర, 18న ద్రౌపదీ జననం ఘట్టంపై హరికథ చెబుతారు. 19న నాటక ప్రదర్శన బకాసుర వధ ఘట్టంతో మొదలవుతంది. 20న ద్రౌపదీ కల్యాణం, 21న ద్రౌపది పూర్వ జన్మ వృత్తాంతం, 22న సుభద్ర కల్యాణోత్సవం, 23న ద్రౌపది అమ్మవారి ఉత్సవాలు, 24న అర్జున తపస్మాన్, రాత్రి పుష్పపల్లకి సేవ, 25న విరాటపర్వం కీచకవధ, 26న రథోత్సవం, అర్జునుడు ఆవుల తిప్పుట, 27న ఇలావంతుని బలి, 28న దుర్యోధన వధ, రాత్రి అగ్నిగుండం పచ్చిగెరిగె, 29న ద్రౌపదీ ధర్మరాజుల పట్టాభిషేకంతో ఈ మహోత్సవాలు పరిసమాప్తమవుతాయని నిర్వాహకులు తెలిపారు.

మహాభాతర మహోత్సవాలకు శ్రీకారం

శ్రీ ద్రౌపది ధర్మరాజుల మహాభారత మహోత్సవాలు అంకుర్పాణంతో శ్రీకారం చుట్టారు. అనంతరం శ్రీ ధర్మరాజు మూల విగ్రహం వద్ద కుండ నిండుగా నీటి ఉంచి, దానికింద ఇసుకను ఎక్కువగా వేసి చుట్టూ నవధాన్యాల విత్తనాలు వేస్తారు. ధర్మరాజుకు ప్రత్యేక పూజలు నిర్వహించి కడవపై కత్తిని ఏటవాలుగా నిలబెట్టారు. కత్తి సక్రమంగా నిలుచుకుని ఉంటే ఆ ఏడాది మహోత్సవాలు బాగా జరుగుతాయని భక్తుల నమ్మకం. ఉత్సవాల చివరి రోజున కత్తిని తొలగిస్తారు.